## క్లుప్తంగా

### వెనక్కి వెళ్లిన సముద్రం



రుషికొండ వద్ద వెనక్కి వెళ్లిన సముద్రం

**కొమ్మాది:** ఇటీవల పెద్ద ఎత్తున కెరటాలు ఎగసి పడుతూ, ముందుకు చొచ్చుకుని వచ్చి తీర ప్రాంత వాసులను భయభ్రాంతులకు గురి చేసిన సముద్రం వెనక్కి మళ్లింది. రుషికొండ బీచ్ వద్ద శనివారం మధ్యాహ్నం వెనక్కి వెళ్లడంతో పర్యాటకులు కొత్త అనుభూతిని పొందారు. తీర ప్రాంతం విశాలంగా కనిపించింది.

### వైఎస్సార్‌సీపీ నేత రమణమ్మకు నివాళి



రమణమ్మ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న చిన్న శ్రీను

**మధురవాడ:** జీవీఎంసీ 7వ వార్డు వాంబే కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు సేనాపతి రమణమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు శనివారం ఆమె నివాసానికి వెళ్లి, మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

### సెల్ టవర్ పనుల అడ్డగింత



సెల్‌టవర్ ఏర్పాటు చేసే ప్రదేశం వద్ద నిరసన తెలుపుతున్న కాలనీ మహిళలు

**మధురవాడ:** జీవీఎంసీ 8వ వార్డు పాత మధురవాడ ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న ఓ భవనంపై సెల్ టవర్ ఏర్పాటుకు చేపడుతున్న పనులను మహిళలు అడ్డుకున్నారు. నిర్వాహకులతో, ఇంటి యజమానితో వాగ్వాదానికి దిగారు. ఇప్పటికే కాలనీలో ఉన్న సెల్‌టవర్ వలన రేడియేషన్‌తో ఇబ్బంది పడుతున్నామని, తాజాగా మరో సెల్ టవర్ ఏర్పాటు చేస్తే ఆరోగ్య సమస్యలు మరింత పెరుగుతాయని పాత మధురవాడ మెట్ట వాసులు వాపోయారు. ఇక్కడ సెల్ టవర్ ఏర్పాటు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. దీంతో పనులు నిలుపుదల చేశారు. ఉన్నతాధికారులు తక్షణమే కలగజేసుకుని అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళన వెనుక కూటమి నాయకులు ఉండడం విశేషం.

### చంద్రంపాలెం హైస్కూల్‌ను సందర్శించిన ఎంఈవో



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఎంఈవో అనురాధ

**మధురవాడ:** పాఠ్యాంశాలు ఎప్పటికప్పుడు పూర్తి చేయడంతో పాటు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగాలని మండల విద్యాశాఖ అధికారి అనురాధ సూచించారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించిన ఆమె, ఉపాధ్యాయులతో డిపార్ట్‌మెంట్ల వారీగా సమావేశమయ్యారు. ఎస్ఏ–1 పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో అసెస్మెంట్, వాల్యుయేషన్, మార్కుల ఆన్‌లైన్ పోస్టింగ్ సకాలంలో జరగాలని ఆదేశించారు. 6వ తరగతి విద్యార్థుల సంసిద్ధతపై సమీక్ష  హెచ్ఎం వెంకటరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పీహెచ్‌సీకి దివీస్‌చే ఫర్నిచర్ వితరణ



వైద్య సిబ్బందికి ఫర్నిచర్ అందిస్తున్న దివీస్ ప్రతినిధులు

**తగరపువలస:** భీమిలిలోని కొలొకేటెడ్ పీహెచ్‌సీకి దివీస్ లేబొరేటరీ యాజమాన్యం శనివారం 80 కుర్చీలు, టేబుళ్లు, అల్మరా, వాటర్ డిస్పెన్సర్ అందించింది. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వైద్యుడు ఫణికుమార్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ దుర్గాకల్యాణి మాట్లాడుతూ సమీక్ష సమావేశాలు నిర్వహించేటప్పుడు ఫర్నిచర్ కొరత ఎక్కువగా ఉంటుందని, ఈ విషయం దివీస్ యాజమాన్యం దృష్టికి తీసుకురాగా వారు వీటిని అందించారని తెలిపారు. కార్యక్రమంలో దివీస్ సీఎస్ఆర్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు, నరసింహ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# అటు ఫుల్.. ఇటు నిల్

సింహాచలం నుంచి విజయనగరం వెళ్తున్న పల్లె వెలుగు బస్సు





తగరపువలస రూటులో ఆటోలు

- సింహాచలం – విజయనగరం రూట్‌లో పది నిమిషాలకో బస్
- తగరపువలస రూట్‌లో ఒక్కటే సర్వీస్
- అదీ రోజుకు రెండు ట్రిప్పులే..
- తగరపువలస రూట్‌లో ప్రయాణికులకు ఆటోలే శరణ్యం
- రాత్రి ఏడు దాటితే అవీ లేక అవస్థలు

**పద్మనాభం:** సింహాచలం నుంచి విజయనగరం రూట్‌లో పది నిమిషాలకో బస్ ఉండగా, తగరపువలస రూట్‌లో ఒక్క సర్వీస్ అదీ రోజుకు రెండు ట్రిప్పులు మాత్రమే నడుస్తోంది. ఒకవైపు ఆర్టీసీ సర్వీసులు పూర్తి స్థాయిలో ఉండగా.. మరోవైపు అస్సలు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు పరిశీలించి, తగరపువలస రూట్‌లో బస్సులు నడపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ప్రైవేట్ బస్సులు కూడా లేక..**

మండలంలోని పలు రూట్లలో బస్ సర్వీసులు లేవు. పద్మనాభం నుంచి భీమునిపట్నం, విజయనగరం నుంచి వయా ఐనాడ, కోరాడ, రేవిడి వరకు బస్సులు లేవు. గతంలో ఈ రూటులో ప్రైవేటు బస్సులు ఉండేవి, ప్రస్తుతం అవీ లేవు. ఈ రూట్‌లో సర్వీస్ ఆటోలు కూడా లేకపోవడంతో ఈ రూటులో ఉన్న కోరాడ, రేవిడి, వెంకటాపురం, బీఆర్ తాళ్లవలస, బొత్సపేట, లింగన్నపేట గ్రామాలకు చెందిన వారు విజయనగరం వెళ్లాలంటే, ప్రత్యేకించి ఆటోలు కట్టించుకోవాల్సిన పరిస్థితి.


- విశాఖపట్నం నుంచి మన్యం వీరుడు అల్లూరి జన్మస్థలం పాండ్రంగికి బస్సు సౌకర్యం లేదు. దీంతో పర్యాటకులు ప్రత్యేక వాహనాల్లో అక్కడికి చేరుకుని, అల్లూరి స్మారక చిహ్నాలను సందర్శించాల్సి వస్తోంది.
- విజయనగరం నుంచి పాట్నూరు వెళ్లాలంటే రెడ్డిపల్లిలో దిగి, ద్విచక్ర వాహన చోదకులను లిఫ్ట్ అడిగి చేరుకోవాలి. విజయనగరం నుంచి పాట్నూరుకు నడిపే ఆర్టీసీ బస్సును పదేళ్ల క్రితం నిలిపివేశారు. దీన్ని పునరుద్ధరించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.
- విశాఖపట్నం నుంచి తగరపువలస, పద్మనాభం మీదుగా కొత్త కొవ్వాడ 222కె ఒకే ఒక బస్సు ఉంది. అది కూడా రెండు ట్రిప్పులు మాత్రమే నడుస్తుంది.
- సింహాచలం–విజయనగరం రూటులో ప్రతీ పది నిమిషాలకు బస్సులు ఉన్నాయి. మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సులు ఈ రూటులో పుష్కలంగా ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో మెట్రో, పల్లె వెలుగు బస్సులు ఒకదాని వెనుక ఒకటి వెళ్లి పోతాయి. ఈ రూటులో బస్సులను ఎక్కువగా నడుపుతున్న ఆర్టీసీ.. మండలంలోని మిగతా రూట్లలో నడపకపోవడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు.

**ఆటోలే ఆధారం**

మండల కేంద్రం పద్మనాభం నుంచి తగరపువలస వెళ్లాలంటే ప్రయాణికులు ఆటోల మీద ఆధారపడాల్సి వస్తోంది. అది కూడా ఎనిమిది నుంచి పది టికెట్లు ఉంటే కాని డ్రైవర్లు ఆటో తీయకపోవడంతో తమ గమ్య స్థానాలకు నిర్ణీత సమయానికి చేరుకోలేకపోతున్నారు.

**రాత్రి 7 దాటితే అవస్థలే..**

పద్మనాభం నుంచి తగరపువలస, తగరపువలస నుంచి పద్మనాభం రావడానికి రాత్రి ఏడు గంటలైతే ఆ ఆటోలు కూడా ఉండవు. విశాఖపట్నం నుంచి తగరపువలస వచ్చే 222 బస్సులను పద్మనాభం జంక్షన్ వరకు పొడిగించాలని, విజయనగరం నుంచి రేవిడి, పాట్నూరు. విశాఖపట్నం నుంచి పాండ్రంగి ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.



విజయనగరం నుంచి సింహాచలం వెళ్తున్న మెట్రో బస్సు

### 222 బస్సులను పద్మనాభం వరకు పొడిగించాలి



విశాఖ నుంచి పద్మనాభం వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంటోంది. పద్మనాభం మీదుగా కొవ్వాడ వరకు ఉన్న ఒక్క సర్వీసు రెండు ట్రిప్పులు మాత్రమే నడుస్తుంది. ఆటోలు ఎక్కుదామంటే, అనుకున్న టిక్కెట్లు వచ్చేవరకు తీయరు. ఎంత సమయం అయినా వేచి ఉండాల్సిందే. అధికారులు స్పందించాలి. విశాఖ నుంచి తగరపువలసకు వచ్చే 222 బస్సులను పద్మనాభం జంక్షన్ వరకు పొడగించాలి.

– పి.ఈశ్వరరావు, కురపల్లి

### ఆటోలు సరిగ్గా ఉండవు



రేవిడి–విజయనగరం రూట్లో ఆటోలు కూడా సరిగా ఉండవు. విజయనగరం వెళ్లాలంటే ఇబ్బంది. గతంలో ప్రైవేటు బస్సులు ఉండేవి, వాటిని కూడా రద్దు చేశారు. ఆర్టీసీ ఈ రూటులో బస్సులు నడపక పోవడం వల్ల మా గ్రామం నుంచి కోరాడ, ఐనాడ, బీఆర్ తాళ్లవలస వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నాం. ఈ రూటులో ఆర్టీసీ బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టాలి

– ఎ.నాగరాజు, వెంకటాపురం

## సుధాకర్‌రెడ్డికి సీపీఐ నివాళి

**తగరపువలస:** సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్ రెడ్డి మృతిపై భీమిలి ఏరియా సీపీఐ నాయకులు శనివారం గుజ్జు రామునాయుడు భవన్‌లో నివాళులు అర్పించారు. సుధాకర్‌రెడ్డి అమర్ రహే అంటూ రెడ్‌సెల్యూట్ చేశారు. విద్యార్థి దశ నుంచే వామపక్ష భావజాలానికి ఆకర్షితుడై ఏఐఎస్ఎఫ్ నాయకునిగా జీవితం ప్రారంభించిన ఆయన రెండుసార్లు పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారన్నారు. పంటల భీమా పథకం, సమాచారహక్కు చట్టం, పనికి ఆహార పథకం వంటి చట్టాలు రావడానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఆయనకు నివాళులు అర్పించిన వారిలో మోర అప్పలరాజు, కానూరి రాంబాబు, చిల్ల రాంపైడి, మావూరి వీర్రాజు, ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

### జోరుగా కల్తీ తేనె అమ్మకాలు

అస్వస్థతకు గురైన వృద్ధురాలు

**పద్మనాభం:** విజయనగరం–కొంత్యాం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై జిల్లా పరిషత్ బంగ్లా వద్ద మూడు రోజులుగా కల్తీ తేనె విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. బిహార్‌కు చెందిన ఆరుగురు యువకులు రసాయనాలతో తయారు చేసిన తేనెను ఆటోలో తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. కృష్ణాపురానికి చెందిన ఇద్దరు వ్యక్తులు శుక్రవారం ఈ తేనెను కొనుగోలు చేయగా.. వారిలో ఒకరి తల్లి ఈ తేనె తాగిన వెంటనే వాంతులు చేసుకున్నారు. దీంతో ఆమె కుమారుడు బిహార్ యువకులను నిలదీశారు. వారు రసాయనాలతో తయారు చేసిన తేనె అని ఒప్పుకున్నారు. వెంటనే బాధితుడు యువకుల వద్ద బకెట్లలో ఉన్న తేనెను రోడ్డుపై పారబోయగా.. యువకులు అక్కడినుంచి ఉడాయించారు.

### ఆటో కార్మికుల ఆందోళన



మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

**మధురవాడ:** రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ఆటో కార్మికులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేదిగా ఉందని సీఐటీయూ అనుబంధ ఆటో రిక్షా యూనియన్ అధ్యక్షుడు పి.రాజ్‌కుమార్ అన్నారు. ఈ పథకం వలన రోడ్డున పడబోతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కొమ్మాది జంక్షన్ నుంచి ర్యాలీ నిర్వహించి, మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు జి. చిన్నారావు, నాగేశ్వరరావు, రాము, ప్రసాద్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుడి కుమార్తెకు డీఎస్సీలో 38వ ర్యాంకు



కుమార్తె సురేఖకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు అప్పన్న, కుమారి

**తగరపువలస:** జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు నమ్మివానిపేటకు చెందిన ముఠా కార్మికుడు కోరాడ అప్పన్న కుమార్తె సురేఖ ఎస్టీటీ కేటగిరీలో జిల్లా స్థాయిలో 87.77 మార్కులతో 38వ ర్యాంకు సాధించి స్ఫూర్తిగా నిలిచారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో, చంటి బిడ్డతో ఉంటూనే పట్టుదలతో డీఎస్సీకి సిద్ధమై ఈ విజయం సాధించారు.

**ఒకేసారి మూడు విభాగాల్లో అర్హత**



సంతోష్

**పద్మనాభం:** పొట్నూరుకు చెందిన నిరుపేద చేనేత కుటుంబానికి చెందిన ఉప్పు సంతోష్.. మూడో ప్రయత్నంలో ఒకేసారి మూడు విభాగాల్లో అర్హత సాధించారు. ఎటువంటి కోచింగ్ తీసుకోకుండానే ఎస్జీటీలో 272వ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)లో 11వ ర్యాంకు, జోన్–1 టీజీటీలో 46వ ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటారు. 2011లో గజపతి నగరంలో పురందేశ్వరి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ, 2016–18లో పద్మనాభం మండలం రెడ్డిపల్లి శాంతినికేతన్‌లో డీఎడ్ చదివారు. బీఈడీ చేసిన తర్వాత 2014, 2018లో డీఎస్సీ రాశారు. ఉద్యోగం రాలేదు. అయినప్పటికీ కలత చెందకుండా ప్రయత్నించి విజయం సాధించారు.

### ఓఎస్‌జీ ఫౌండేషన్ చేయూత

**తగరపువలస:** ఆనందపురం కేంద్రంగా పని చేస్తున్న ఓఎస్‌జీ ఫౌండేషన్ శనివారం రెండు కుటుంబాలకు రూ.35వేలు ఆర్థిక సాయం అందించింది. విజయవాడకు చెందిన లక్ష్మి, సుబ్బారెడ్డి దంపతులకు ఏడు నెలల వయసు గల 1500 గ్రాముల బిడ్డ జన్మించడంతో ఆస్పత్రిలో ప్రత్యేక సదుపాయాలతో ఉంచడానికి రోజుకు రూ.16వేలు అవసరం అవుతోంది. దీంతో ఓఎస్‌జీ ఫౌండేషన్, హెల్పింగ్ హార్ట్స్‌తో కలిపి రూ.25వేలు సేకరించి గుంటూరు చిన్నపిల్లల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బిడ్డ తల్లిదండ్రులకు అందించారు.

- శ్రీకాకుళం జిల్లా మందస మండలం మర్రిపాడు గ్రామానికి చెందిన 20 ఏళ్ల తాళ్ల పవన్ ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్లి, అనారోగ్యంతో తిరిగి ఇంటికి వస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. దీంతో పవన్ తండ్రి బాలకృష్ణకు రూ.10వేలు అందించినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు దళాయి శివ తెలిపారు.

### విద్యార్థినులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ సౌజన్య

**భీమునిపట్నం:** విద్యార్థినులందరూ చట్టాలపై అవగాహన ఏర్పరచుకోవాలని భీమిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ డి.సౌజన్య అన్నారు. స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద శనివారం సాయంత్రం కోర్టు ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. అన్యాయం జరిగిన వారి తరపున నిలబడటానికే చట్టాలు ఉన్నాయన్నారు. చట్టాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, ఎవరికి ఎటువంటి అన్యాయం జరిగినా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలు, బాలికలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, అవసరమైనప్పుడు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎస్.జనార్థన రావు, సీనియర్ న్యాయవాది ఎం.వి.పార్వతీశం, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### కేజీబీవీ విద్యార్థులకు అవగాహన

**తగరపువలస:** ఆనందపురం కేజీబీవీని గీతం విశ్వ విద్యాలయం విద్యార్థులు శనివారం సందర్శించి, ప్రకృతి పథ్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా వర్షాకాల పరిశుభ్రత, నో బ్యాగ్ డే, జాతీయ అంతరిక్ష దినోత్సవం, మొక్కల పెంపకం, విత్తన ఉద్యమం, స్థిరత్వం, వ్యక్తిగత, రుతుస్రావ పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ గురించి తెలియజేశారు. రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్‌ను పాటించాలన్నారు. విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ ఏపీసీ జోగ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

## పరిశుభ్రతతో వ్యాధులు దూరం

- ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యం
- సీహెచ్‌సీ వైద్యాధికారి ఫణికుమార్
- వాడవాడలా 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర'



ప్రతిజ్ఞ చేస్తున్న చంద్రంపాలెం హైస్కూల్ విద్యార్థులు

**భీమునిపట్నం:** ప్రతి ఒక్కరూ స్వచ్ఛత, పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధులకు దూరంగా ఉండవచ్చని భీమిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రధాన వైద్యాధికారి ఫణికుమార్ సూచించారు. ఆస్పత్రి వద్ద శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నందున కాచి, చల్లార్చిన నీరు తాగాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో ర్యాలి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లల్లో తల్లితండ్రులకు విద్యార్థులు అవగాహ కల్పించాలని కోరారు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

**విద్యార్థుల ప్రతిజ్ఞ**

**మధురవాడ:** చంద్రంపాలెం హైస్కూల్లో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సుమారు 3వేల మంది స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తామని నినదించారు. భీమిలి డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.నాగేశ్వరరావు స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర ప్రాముఖ్యత గురించి వివరించారు. హెచ్ఎం వెంకటరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ**

**పద్మనాభం:** స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్రలో భాగంగా రేవిడి, పద్మనాభంలో ర్యాలీలు నిర్వహించారు. రేవిడిలో జరిగిన ర్యాలీలో మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి, ఆయుర్వే వైద్యాధికారిణి సృజన, డిప్యూటీ ఎంపీడీవో మీనా కుమారి, రేవిడి ఎంపీటీసీ సీర సూరప్పడు, ఆర్ఐ శ్యామల, రేవిడి పీహెచ్‌సీ ఉద్యోగులు పాల్గొన్నారు.

**వర్షాకాలంలో జాగ్రత్తలపై ప్రచారం**

**తగరపువలస:** వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ వహించాలని చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి సూచించారు. జెడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్లు, సాంఘిక సంక్షేమ వసతిగృహం, చుట్టుపక్కల ఇళ్లకు వెళ్లి వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రచారం నిర్వహించారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



రేవిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ ఉద్యోగులు



మెయిన్ రోడ్డులో ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యులు ఫణికుమార్, వైద్యులు, సిబ్బందితో నిర్వహిస్తున్న ర్యాలి



డిగ్రీ కళాశాల వద్ద వైస్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు నిర్వహిస్తున్న ర్యాలీ



చిట్టివలస ప్రభుత్వ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీవాణి

### డిగ్రీ కళాశాలకు కంప్యూటర్లు, ప్రింటర్ అందజేత



కంప్యూటర్లు, ప్రింటర్‌తో విద్యార్థులు, అధ్యాపకులు

**తగరపువలస:** నగరానికి చెందిన ఎక్స్‌టీ గ్లోబల్ ఇన్‌ఫోటెక్ లిమిటెడ్ శనివారం చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రెండు కంప్యూటర్లు, ఒక ప్రింటర్ అందించింది. విద్యార్థుల సౌలభ్యం కోసం వీటిని అందించినట్లు ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి తెలిపారు. కంపెనీ జనరల్ మేనేజర్ వి.సుబ్బారావుకు కళాశాల సిబ్బంది ధన్యవాదాలు తెలియజేశారు.

## హెచ్చరిక బోర్డు మాయం

ఆర్డీవో ఆగ్రహం



ప్రభుత్వ స్థలంలో మాయమైన హెచ్చరిక బోర్డు

**కొమ్మాది:** ఆక్రమిత స్థలాల్లో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు మాయమవడంపై ఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ 4వ వార్డు బీచ్ రోడ్డు కాపులుప్పాడ రెవెన్యూ కె.నగరపాలెం పరిధి నర్సింహనగర్‌లో ఆక్రమిత ప్రభుత్వ స్థలాల్లో నాలుగు చోట్ల ఆర్ఐ శ్రీదేవి, ఇతర రెవెన్యూ సిబ్బంది కలసి ఈ నెల 21న హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వాటిలో నర్సింహనగర్ బస్టాప్ సమీపంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును ఆక్రమితదారులు తొలగించేశారు. స్థానికులు ఆర్డీవో సంగీత్ మాథూర్‌కు ఫిర్యాదు చేయడంతో, ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను ఆక్రమితదారులు తొలగించడంపై మండిపడ్డారు. బోర్డు తొలగించిన ప్రాంతంలో వెంటనే మళ్లీ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని, బోర్డు తొలగించిన వారిపై కేసు నమోదు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

### కొత్త భవనం ఎలివేషన్ తొలగింపు

**కొమ్మాది:** జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడలో తోలాడ ఎర్రయ్య అనే వ్యక్తి ఇటీవల నిర్మించిన భవనం ఎలివేషన్‌ను అధికారులు తొలగించారు. ఈ భవనం ఎలివేషన్ దీనికి దగ్గరలో ఉన్న ప్రాథమిక పాఠశాలపైకి రావడంతో అదే ప్రాంతానికి చెందిన వాసుపల్లి విజయ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఏసీపీ రామకృష్ణ ఆదేశాల మేరకు సిబ్బంది శనివారం ఎలివేషన్‌ను తొలగించారు.

### డీఎస్సీలో విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

**తగరపువలస:** భీమిలి జోన్ రెండోవార్డు నమ్మివానిపేటకు చెందిన కోరాడ సురేష్ డీఎస్సీలో 87.77 మార్కులతో జిల్లా స్థాయిలో ఓపెన్ కేటగిరీలో 38వ ర్యాంకు సాధించారు. ఒకటోవార్డుకు చెందిన గొట్టిపల్లి లిఖిత 79.17 మార్కులతో బీసీ బి కేటగిరీలో 324వ ర్యాంకు సాధించగా అదే వార్డు చిట్టివలసకు చెందిన ఏడిద ఆశీర్వాదం 79.49 మార్కులతో బీసీ సీ కేటగిరీలో తూర్పు గోదావరి జిల్లాలో 355వ ర్యాంకు సాధించాడు.

### నాలుగో రోజుకు రైతుల వంటావార్పు

**పద్మనాభం:** మండలంలోని కృష్ణాపురంలో సూది కొండ వద్ద ఎంఎస్ఎంఈ పార్కుకు సాగులో ఉన్న భూముల కేటాయింపును వ్యతిరేకిస్తూ రైతుల నిరసనలు కొనసాగుతున్నాయి. నాల్గో రోజూ రైతులు వంటావార్పు చేపట్టారు. రైతులందరూ కలిసి మధ్యాహ్న భోజనాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొలె అప్పలనాయుడు, గాడు అప్పలరాజు, సురాల పైడిరాజు పాల్గొన్నారు.